రుణమాఫీ చేయాలని రైతుల నిరసన



మేనేజర్ ప్రకాశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

ఘట్‌కేసర్: పంట రుణాలను తక్షణమే మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎదులాబాద్ రైతులు స్థానిక రైతు సేవా సహకార సంఘం కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకట్రామ్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి బాసిత్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆడిట్ మ్యాపింగ్ చేయిస్తుందని, పూర్తయిన వెంటనే రుణ మాఫీ అవుతుందని, ఆందోళన చెందవద్దని సూచించారు. రుణదాతల కుటుంబ, ఆధార్ వివరాలు పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం రైతు సేవా సహకార సంఘం మేనేజర్ ప్రకాశ్‌కు రుణాలు మాఫీ చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ఉదయ్ కుమార్‌రెడ్డి, రైతులు సత్తయ్య ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ రవి, అమర్, ఓంప్రకాశ్ రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌సెట్‌లో వర్క్‌షాప్ ప్రారంభం



పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో పీసీబీ డిజైన్ ఆర్ట్ అప్లికేషన్స్‌పై రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో టెక్నోట్రస్ మేనేజింగ్ డైరెక్టర్ వికాస్‌రెడ్డి, సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్‌పై నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్ సీఈఓ అభినవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, డీన్ రవికుమార్, రవింద్ర బాబు, కో ఆర్డినేటర్ నాగరాజునాయక్, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

కల్వర్టు పనులు తక్షణమే ప్రారంభించాలి

ఎంపీ ఈటల రాజేందర్



జగద్గిరిగుట్ట: షాపూర్‌నగర్ నుంచి జగద్గిరిగుట్ట వెళ్లే పైపులైన్ రోడ్డులో కల్వర్టు పనులను తక్షణమే మొదలపెట్టాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం కురిసిన భారీ వర్షానికి ఈ రోడ్డులో రాకపోకలు స్తంభించాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఎంపీ పరిశీలించి జోనల్ కమిషనర్‌తో మాట్లాడారు. సమస్యను పరిష్కరించేందుకు పనులను మొదలు పెట్టాలన్నారు. శేషగిరి, భరత సింహారెడ్డి, శ్యామ్ కిరణ్, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిశీలించిన ఎంపీ

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై మంగళవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు. కొన్ని రోజులుగా డ్రైనేజీ లైన్ అధ్వానంగా మారడంతో స్థానికంగా తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకులు రాజేందర్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను పరిశీలించిన ఎంపీ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

విద్యుత్ అంతరాయాన్ని నిరసిస్తూ ధర్నా



కుత్బుల్లాపూర్: విద్యుత్ అంతరాయాలను నిరసిస్తూ మంగళవారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని పలు కాలనీల అసోసియేషన్ సభ్యులు వెన్నెలగడ్డలోని ఈఆర్‌ఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు నెలలుగా సాయిబాబానగర్ ఫీడర్ పరిధిలో రాత్రి, పగలు తేడా లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అనంతరం డీఈ శ్రీనాథ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎం.ఎస్.రెడ్డి కాలనీ ఫేస్-1 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్ గౌడ్, బ్యాంక్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, న్యూ వివేకానంద నగర్ మాజీ ప్రెసిడెంట్ సత్తయ్య గౌడ్, ఎల్లాగౌడ్, బలరాం, పరమేష్, బాలరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

నివాళులర్పించిన నాయకులు, కార్యకర్తలు



జవహర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న మేయర్ శాంతి, కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ తదితరులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, మండలంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఘట్‌కేసర్, ఘనాపూర్, ఎదులాబాద్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటం, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, రూప్‌సింగ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, మండలాధ్యక్షుడు రాజేశ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, జంగయ్య యాదవ్, సంజీవరెడ్డి, కౌన్సిలర్ మల్లేశ్, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజ్ ముదిరాజ్, చిత్తారియాదవ్, అమర్, రవి, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

మేడ్చల్ పట్టణంలో..

మేడ్చల్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు రాజీవ్ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లోనూ నిర్వహించారు.

మున్సిపాలిటీ, మండలంలో..

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు, కీసర మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. దమ్మాయిగూడ చౌరస్తాలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగారం మున్సిపాలిటీలో పట్టణ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో, కీసరలో మండలాధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

శామీర్‌పేట మండలంలో..

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలంలోని కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తూంకుంట మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో దేవరయాంజాల్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్ అధ్యక్షుడి ఆధ్వర్యంలో..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ శాంతికోటేష్‌గౌడ్ పాల్గొని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్ వేణు ముదిరాజ్, నేతలు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో చైర్‌పర్సన్ పావనీజంగయ్య, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి ..



మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



దేవరయాంజాల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



కీసరలో..



ఉప్పొంగి ప్రవహిస్తున్న సుతారిగూడ చెరువు..

- రెండుగంటల పాటు కుండపోత
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇళ్లలోకి చేరిన వరద



మేడ్చల్ రాఘవేంద్రనగర్ కాలనీలో..

దంచికొట్టిన వాన

మేడ్చల్: మేడ్చల్‌లో మంగళవారం తెల్లవారుజామున 2 గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా డ్రైనేజీలు పొంగిపొర్లాయి. వరద రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు కాలనీల్లో ఇండ్లలోకి నీరు చేరింది. చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు చేరింది. అధికారులు సిబ్బందిని అలెర్ట్ చేసి వరద సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.

దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీ పరిధిలో ..

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని వరద నాగారం మున్సిపల్ పరిధిలోని లోతట్టు కాలనీలకు చేరింది. బీఎంఆర్, సాయిరత్నా, అరవింద్‌నగర్, సాయిసంజీవ, తివారీ ఎన్‌క్లేవ్, బీబీసీ రహదారుల గుండా వరద, మురుగు నీరు ప్రహహిస్తుండడంతో లోతట్టు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాంపల్లి చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై నుంచి పెద్ద ఎత్తున నీరు ప్రహించడంతో ట్రాఫిక్‌జాం అయ్యింది. మున్సిపల్ సిబ్బంది, కీసర పోలీసులు వరద సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్ రాంపల్లిచౌరస్తాతో పాటు, లోతట్టు కాలనీల్లో పర్యటించారు.

పాము కలకలం



జవహర్‌నగర్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోకి వరదతో పాటు పాములు సైతం ఇంట్లోకి వస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురువుతున్నారు. కార్పొరేషన్ పరిధిలోని జ్యోతికాలనీలో మంగళవా రం ఓ ఇంట్లోకి బురదనీటితో పాము చేరడంతో కాలనీవాసులు ఆందోళన చెందారు. కమిషనర్ వెంటనే చర్యలు తగు తీసుకోవాలని వారు కోరారు.



నాగారం రాంపల్లి చౌరస్తా వద్ద వరదను పరిశీలిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్



వరద వెళ్లేలా చర్యలు చేపడుతున్న మున్సిపల్ సిబ్బంది



నాగారంలో ప్రహహిస్తున్న వరద

వ్యక్తి అదృశ్యం

మేడిపల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ మణికంఠ కాలనీలో నివాసం ఉంటున్న వడపల్లి పీరుసాహెబ్ (40) స్థానికంగా మేస్త్రీ పనిచేస్తున్నాడు. ఈనెల 5న ఉదయం ఇంటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలులో ఉంటున్న తన తల్లి వద్దకు వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు మంగళవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ

శామీర్‌పేట్: పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం చేయవద్దని మేడ్చల్ డీఎల్‌పీఓ సాంబిరెడ్డి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మూడుచింతలపల్లి మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ఆస్తి పన్ను వసూళ్లను 100 శాతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీఓ మంగతాయారు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు ఎత్తేయాల్సిందే !

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- బాధితులకు అండగా నిలిచిన జీఎల్‌ఆర్..



ఆదర్శనగర్ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, ఆదర్శనగర్‌లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును ఎత్తేయాల్సిందేనని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదర్శనగర్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చెత్త సేకరణ కేంద్రం కాస్తా డంపింగ్ యార్డుగా మార్చడంతో సమీప కాలనీల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో డంపింగ్ యార్డును ఎత్తేయాలంటూ.. బాధితులు చేపట్టిన ఆందోళనకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మద్దతు ప్రకటించారు. మంగళవారం ఆదర్శనగర్ డంపింగ్ వద్ద నెలకొన్న పరిస్థితులను ఆయన కాప్రా తహసీల్దార్ సుచరితతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఆదర్శనగర్‌లో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డుతో ప్రభుత్వం, జీహెచ్ఎంసీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రైవేటు ఏజెన్సీ తాత్కాలికంగా చెత్త సేకరణ పేరుతో ఇక్కడ ప్రవేశించి డంపింగ్‌యార్డుగా మారిస్తే సహించేది లేదన్నారు. ఇక్కడ ఉన్న చెత్తను పూర్తిగా తరలించాలని, నేటి నుంచి చెత్త వాహనాలు ఇటువైపుగా రాకూడదని హెచ్చరించారు. ఎమ్మెల్యే రాకతో పెద్దఎత్తున స్థానికులు తరలిరావడంతో జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు సిబ్బందితో తరలివచ్చి బందోబస్తు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, స్థానికనేతలు నేమూరి మహేష్‌గౌడ్, సీసీఎస్ ప్రతినిధి ఎంపల్లి పద్మారెడ్డి, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గంప కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్‌సీఈ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన



పారిశ్రామిక ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ విద్యార్థులు మంగళవారం పారిశ్రామిక సందర్శనకు వెళ్లారు. సోమాజిగూడ పారిశ్రామికవాడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అమెచ్యూర్ రేడియో సంస్థను సందర్శించిన విద్యార్థులకు అధ్యాపకులు వివిధ రకాల అమెచ్యూర్ రేడియోలు, అత్యవసర కమ్యూనికేషన్ల ప్రయోజనాలకు రేడియో ఫ్రీక్వెన్సీ స్పెక్ట్రంల ఉపయోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్, హెచ్ఓడీ సంపత్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

ఉప్పల్ : ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఇద్దరు పిల్లలను వదిలేసి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకానగర్ బోడ్రాయి ప్రాంతానికి చెందిన సిలిపురం రవితో 15 ఏళ్ల క్రితం అనితకు వివాహమైంది. రవి ఆర్టీసీక్రాస్ రోడ్డులో టీ బండి నడిపిస్తున్నాడు. కాగా వీరికి ఇద్దరు సంతానం రఘు (11), రాహుల్(8) ఉన్నారు. కొద్ది కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. 19న యథావిధిగా భర్త టీ బండి వద్దకు వెళ్లాడు. పిల్లలు మరో గదిలో ఆడుకుంటుండగా.. అనిత ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు భర్తకు సమాచారం ఇవ్వడంతో అతడు వచ్చి చూసేసరికి ఆమె మృతి చెందింది. సమచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డంపింగ్ యార్డ్‌ను తరలించాలి

జవహర్‌నగర్: నివాసాలకు ఆనుకుని ఉన్న జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్‌ను తరలించాలని డంపింగ్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తాను మంగళవారం కలిసి సమస్యను వివరించారు. జవహర్‌నగర్‌లో డంపింగ్‌యార్డ్ విస్తరణకు హెచ్ఎండీఎకు చెందిన సుమారు 70 ఎకరాలను రాంకీ సంస్థతో ఒప్పందం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం వాటిని తిరస్కరించి ఇక్కడి నుంచి డంపింగ్‌యార్డ్‌ను తరలించాలని కోరారు. కార్యక్రమంలో డంపింగ్ జేఏసీ నాయకులు కేతెపల్లి పద్మాచారి, గోగుల రామకృష్ణ, మారం సమ్మిరెడ్డి, శ్రీనివాస్ శర్మ, పీలేష్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన డీసీపీ



వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ పద్మజారెడ్డి, ఏసీపీ చక్రపాణి

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని వినాయకసాగర్ శ్రీ లక్ష్మీనారాయణ చెరువును మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజారెడ్డి, ఏసీపీ చక్రపాణి, స్థానిక ఇన్‌స్పెక్టర్లతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వినాయక నిమజ్జనం లైట్లు, భారీ కేడ్ల ఏర్పాటు, ట్రాఫిక్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసుల వసతి ఏర్పాటుకు స్థలాన్ని సందర్శించారు. ఆయన వెంట ఘట్‌కేసర్, పోచారం ఇన్‌స్పెక్టర్లు సైదులు, రాజువర్మ, ఘట్‌కేసర్, పోచారం మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, వేమనరెడ్డి, నాయబ్ తహసీల్దార్ ధర్మేందర్, ఎస్సై శ్రీకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఘట్‌కేసర్: ఎదులాబాద్ గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మల్లారెడ్డి నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం అందజేశారు. పొన్నమ్మ, మహేశ్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ. 30 వేలు, 21 వేలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్, శరత్‌గౌడ్, ఆశీష్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు భరోసా..



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు ఎంతో భరోసా కల్పిస్తున్నదని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. అంకిరెడ్డి పల్లికి చెందిన బోయిని నర్సింహులుకు రూ 60 వేలు, కొనుగోని వెంకటేశ్‌కు రూ 50 వేల చొప్పున మంజూరు కాగా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సింగారం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు షురూ

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీలోని శ్రీ గాయత్రిమహాక్షేత్రంలో శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకుడు డా. ఎస్ఎల్ఎన్ఎస్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రధాన అర్చకుడు రాఘవేంద్ర, పండితులు స్వామివారికి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

శ్మశాన వాటిక పరిశీలన



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న కమిషనర్ సాబేర్ అలీ

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కొండాపూర్ ఎస్సీ శ్మశాన వాటికలో సమస్యలు పరిష్కరించాలని స్థానిక కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, స్థానికుల విన్నపం మేరకు కమిషనర్ సాబేర్ అలీ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్నానాల గదిలో నీటి సౌకర్యం కల్పించాలని, బోరులో పడిపోయిన మోటారును బయటకు తీయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్, నాయకులు యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమలానగర్‌లో 'సైంటిఫిక్ టెంపర్ డే'

కాప్రా: రాష్ట్ర ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ కార్యాలయంలో 'సైంటిఫిక్ టెంపర్ డే' ను నిర్వహించారు. మంగళవారం ప్రముఖ హేతువాది నరేంద్ర దబోల్కర్ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ.. హేతువాది, సంఘసంస్కర్త, వైద్యుడిగా నరేంద్ర దబోల్కర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాట సమితిని ఏర్పాటు చేసి అనేక మందికి అవగాహన కల్పించారని వివరించారు. సామాజిక ఉద్యమ నాయకులు కోమటి రవి, స్ఫూర్తి గ్రూప్ ప్రతినిధులు శ్రీమన్నారాయణ, జైరాజు, చంద్రశేఖర్, సంతోష్, ఉన్నికృష్ణన్, శ్రీనివాస్, లక్ష్మయ్య, శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.